క్లుప్తంగా

ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం


గణపతి పూజ చేస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి ఉపాలయమై, క్షేత్ర దేవతగా విరాజిల్లుతోన్న శ్రీ కుంకుళ్లమ్మ ఆలయ వార్షికోత్సవ మూడు రోజుల వేడుకలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మద్దిలో పూజలు

జంగారెడ్డిగూడెం : గుర్వాయిగూడెం మద్ది ఆలయంలో మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం వరకు దేవస్థానానికి వివిధ సేవలు, విరాళాల ద్వారా రూ.2,23,162 సమకూరినట్టు ఈఓ ఆర్వీ చందన తెలిపారు. నిత్యాన్నదాన సత్రంలో సుమారు 2000 మంది అన్నప్రసాదం స్వీకరించారని ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ తెలిపారు. గురవాయిగూడెం శ్రీ హరిహరసత అయ్యప్ప స్వామి ఉపాలయమైన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

భారీ అన్నసమారాధన

జంగారెడ్డిగూడెం: స్థానిక అశ్వారావుపేట రోడ్డులోని సుందర బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో మంగళవారం సందర్భంగా పూజలు నిర్వహించారు. ప్రతి మంగళవారం నిర్వహించే విధంగా భక్తుల వితరణతో అన్నసమారాధన నిర్వహించారు.

10 నుంచి ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం: స్థానిక విజయ దుర్గమ్మకు ఈనెల 10, 12, 24 తేదీల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు విజయదుర్గమ్మ ఆలయ కమిటీ తెలిపింది. 10న అమ్మవారికి పల్లకీసేవ, గ్రామోత్సవం, 12న 31వ చండీ హోమం, రాత్రి అన్నసమారాదన, 24న శివపార్వతులకు పల్లకీ సేవ ఉంటుందని పేర్కొంది. భక్తులంతా పాల్గొనాలని కోరింది.

వైభవంగా కొర్రాజుల పెద్దమ్మతల్లి జాతర

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం ములగలంపల్లిలో కొర్రాజుల పెద్దమ్మతల్లి జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళవారం స్వామివారిని గ్రామంలో ఊరేగించారు. అర్చకుడు బేతిన వెంకన్న మాట్లాడుతూ వారం రోజుల పాటు ఈ జాతర మహోత్సవాలు నిర్వహిస్తామన్నారు. గద్దె కట్టడం, పూజలు చేయడం, నిత్యదీపారాధన, బియ్యం కొలవడం, వనదేవతలను తీసుకురావడం, నిప్పుల గుండం కార్యక్రమాలతో జాతర ముగుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో భక్తులంతా పాల్గొనాలని ఆయన కోరారు.

వేసవి విజ్ఞాన తరగతులు


లింగపాలెం: వేసవి సెలవులు సద్వినియోగం చేసుకునేలా విద్యార్థులకు శాఖాగ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయాధికారిణి సీహెచ్‌వీ రమణ తెలిపారు. విద్యార్థులకు ఆపదలో పడిన కుందేలు అనే కథను వివరించారు. తెలుగు రాతను ప్రాక్టీస్ చేయించారు. వేమన పద్య రత్నాకరం నుంచి కొన్ని పద్యాలను చెప్పించారు. జనరల్ నాలెడ్జ్ సంబంధించి ప్రశ్నలను వివరించారు. విద్యార్థులు 10 మంది పాల్గొన్నారు.

షెడ్ల నిర్మాణానికి విరాళం


విరాళం ఇచ్చిన దాత కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: శ్రీ నూకాలమ్మ దేవస్థానంలో షెడ్ల నిర్మాణానికి దాతలు విరివిగా సహకరిస్తున్నారని ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. తొలుత ఆలయంలో అమ్మవారికి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం చేపట్టిన షెడ్ల నిర్మాణానికి మంగళవారం స్థానిక మేడపు రెడ్డి వెంకటరమణ, నూకరత్నం, వారి అల్లుడు కోట నాగవెంకట దుర్గాప్రసాద్, నాగలోవ భారతీదేవి దంపతులు రూ.1,01,116 విరాళమిచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా దాత కుటుంబసభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పోలుపర్తి రాము, గాలి నూకరాజు, పోలుపర్తి కన్నారావు, నూకారపు లోవ, పైల చంటి, మహిళా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జూన్‌లో వికసించిన మే పుష్పం



ద్వారకాతిరుమల: తిమ్మాపురంలో పోలిన శ్రీనివాసరావు ఇంటి వద్ద పూల కుండీలో ఒక మే పుష్పం మంగళవారం వికసించింది. ప్రతి ఏటా ఈ పుష్పం మే నెలలో మాత్రమే పూస్తుంది. అందుకే దీన్ని మే పుష్పమని పిలుస్తారు. అయితే ఈ సారి ఈ పుష్పం జూన్ నెలలో పూసి, అందరినీ ఆకర్షిస్తోంది.

హామీల అమలులో విఫలం

- కూటమి పాలనలో ప్రజలకు పాట్లు
- వైఎస్సార్ సీపీ హయాంలో పథకాలకు మంగళం


వైఎస్సార్ సీపీ హయాంలో ట్రాక్టర్లు, పనిముట్లు పంపిణీ చేసిన దృశ్యం (ఫైల్)



బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ పేరుతో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలివీ

బుట్టాయగూడెం: ఎన్నికల సందర్భంగా సూపర్ సిక్స్ పథకంతోపాటు 143 ఇతర హామీలు ఇచ్చిన చంద్రబాబు ఏడాది పాలన పూర్తయినా వాటిని అమలు చేయకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం వంటి పథకాలు ప్రకటించినా ఏ ఒక్కటీ అమలు చేయకుండా తాత్సారం చేస్తూ వస్తున్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోవగా వైఎస్సార్ సీపీ హయాంలో దేశంలోనే ఆదర్శంగా నిలిచిన పథకాలను ఒక్కొక్కటిగా కూటమి ప్రభుత్వం రద్దు చేస్తూ వస్తోంది. ఉత్తమ సేవలు అందించిన వలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. రైతులకు, ప్రజలకు గ్రామస్థాయిలోనే ప్రభుత్వ సేవలందించేందుకు ఏర్పాటు చేసిన సచివాలయాలను కూడా నిర్వీర్యం చేసింది. ఇంటింటికీ రేషన్ పథకానికి ఈ నెల 1వ తేదీ నుంచే మంగళం పలికింది. దీంతో ప్రజల రేషన్ షాపుల వద్ద క్యూ కడుతున్నారు. తల్లికి వందనం అదుగో ఇస్తాం .. ఇదుగో ఇస్తాం అని కాలం గడిపేస్తున్నారు. ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో వ్యవసాయ పనులు ప్రారంభించేందుకు సమయం ఆసన్నమైంది. ఈ పరిస్థితుల్లో రైతులకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా ఎప్పుడిస్తారో తెలియక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పథకాలు అమలు చేస్తామంటూనే ప్రజలను నమ్మించి గద్దె నెక్కిన చంద్రబాబు పథకాల అమలులో నిర్లక్ష్యం చేయడం పట్ల తీవ్రం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో..

పోలవరం నియోజకవర్గంలో అభివృద్ధి విరబూసింది. సంక్షేమ పథకాలు ప్రతి గడపగడపకూ చేరాయి. సుమారు రూ.923.24 కోట్లతో సంక్షేమ పథకాలను అమలు చేశారు. సుమారు రూ.665.77 కోట్లతో అభివృద్ధి పథకాలను పూర్తిచేశారు. అభివృద్ధి, సంక్షేమం మొత్తం కలిపి ఒక్క పోలవరం నియోజకవర్గంలోనే రూ.1,588.91 కోట్లు ఖర్చు చేశారు.

సూపర్ సిక్స్‌కు మంగళం

చింతలపూడి : ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలతో పాటు 143 హామీల ఆశ చూపి అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ పేద, సామాన్య మధ్యతరగతి వర్గాల ప్రజలను మోసం చేసింది. అధికారం చేపట్టి ఏడాది కావస్తున్న ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా అటకెక్కించింది. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని, రోడ్లు నిర్మిస్తానమని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివద్ధి చేస్తామని కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏడాది కావస్తున్నా అమలులకు నోచుకోలేదు.

అన్నీ కుట్రలు, కుతంత్రాలే



కూటమి ప్రభుత్వ పాలనలో అన్నీ కుట్రలు కుతంత్రాలు, అనినీతి, వెన్నుపోటే జరిగింది. ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా ప్రజలను కూటమి ప్రభుత్వం నమ్మించి మోసం చేసింది. కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వమే కానీ చేతల ప్రభుత్వం కాదు. ఇది నయవంచన ప్రభుత్వం.

– తెల్లం బాలరాజు, మాజీ ఎమ్మెల్యే, దుద్దుకూరు, బుట్టాయగూడెం మండలం

చంద్రబాబు అంతే



టీడీపీ అధినేత చంద్రబాబు గతంలో కూడా ఇదే ఇదే విధంగా 600 హామీలు ఇచ్చి ఏ ఒక్క హామీని అమలు చేయలేదు. మళ్లీ అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు. అధికారంలోకి వచ్చాక ఖజానా ఖాళీ, సంపద సృష్టించాలని చెబుతూ ప్రజలను దగా చేశారు. ప్రజలు తగిన సమయంలో బుద్ధి చెబుతారు.

– కంభం విజయరాజు, వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్

కొనసాగిన రేషన్ పరేషాన్

కొయ్యలగూడెం: రేషన్ లబ్ధిదారుల కష్టాలు మంగళవారం కూడా కొనసాగాయి. రేషన్ షాపుల వద్ద లబ్ధిదారులు సరుకుల కోసం పడిగాపులు పడాల్సి వచ్చింది. సర్వర్ల కష్టాలకు తోడు సమయాభావం వల్ల లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రేషన్ తీసుకోవడానికి కరువు పనులు (ఉపాధి పనులు) మానుకుని ఉండాల్సి వస్తోందని లబ్ధిదారులు వాపోయారు. కన్నాపురం, రాజవరం, బయ్యన్నగూడెం గ్రామాల్లో లబ్ధిదారులు రేషన్ పొందడానికి ఇళ్లను వదిలి రావాల్సి వస్తోందని, పిల్లల్ని ఒంటరిగా వదిలి రావడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. రేషన్ బియ్యాన్ని తీసుకు వెళ్ళడానికి రవాణా చార్జీలకు రూ.100 తీసుకుంటున్నారని, తీసుకున్న బియ్యం రేటు కంటే రవాణాకి అధిక మొత్తం ఇవ్వాల్సి వస్తుందని మహిళలు ఆవేదన చెందారు.

నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలి

ద్వారకాతిరుమల: స్థానిక ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోర వికాసం 2.0 కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.మేరి నాయకత్వం – సాధికారత అంశాలపై బాలికలకు అవగాహన కల్పించారు. సచివాలయం–2 జీఎంఎస్‌కే లక్ష్మీ సుజన మాట్లాడుతూ బాలికలు మంచి స్థిరమైన, సరైన నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ కలిగి ఉండటమే సాధికరత అని అన్నారు. సంపూర్ణ ఆరోగ్యానికి యోగా తప్పనిసరని అన్నారు.

‘వెన్నుపోటు దినం’ను విజయవంతం చేద్దాం


చింతలపూడి : పార్టీ నాయకులతో విజయరాజు


కుక్కునూలరు : పోస్టర్ విడుదల చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి విజయరాజు

చింతలపూడి : కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా చేసిన మోసాలను నిలదీస్తూ బుధవారం నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు పిలుపునిచ్చారు. జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడు బొడ్డు వెంకటేశ్వరరావు గృహం వద్ద మంగళవారం పార్టీ కార్యకర్తలలో ఆయన సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఇచ్చిన హామీల అమలులో విఫమైందన్నారు. ఉదయం 9.30 గంటలకు స్థానిక బొడ్డు వెంకటేశ్వరరావు ఇంటి నుంచి తహసీల్దార్ కార్యాలయంలో వరకు ర్యాలీ నిర్వహిస్తామని, అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తామని తెలిపారు. పార్టీ చింతలపూడి నియోజకవర్గ నేతలు, కార్యకర్తలు పాల్గొనాలని విజయరాజు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, విద్యార్థి విభాగం కన్వీనర్ మిరియాల దిలీప్, ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్ కాంతారావు, ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ నాయకులు ఎం ఇమ్మనియేలు, త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, జి.రాజేష్ నాయుడు, మాజీ సొసైటీ అధ్యక్షుడు ఎ.సుబ్బారావు, గోల్కొండ సురేష్, గంగాధరరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం పోస్టర్ విడుదల

కుక్కునూరు: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం కొయ్యలగూడెంలో నిర్వహించే వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తాండ్ర రాజేష్ పిలుపునిచ్చారు. మంగళవారం కుక్కునూరులో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. రాజేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కదాన్ని కూడా అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. హామీల అమలు కోరుతూ నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రావు వినోద్, కుచ్చర్లపాటి కృష్ణంరాజు, చిన్న నరసింహరాజు, మల్లేల చంటినాయుడు, రాయి సత్యనారాయణ, పగిళ్ల అల్లేష్, భూపతి చిన్న రంగరాజు, ఉదర శ్రీను, వేల్పుల శ్రీను, నాగుల్‌మీరా, పరిటాల వినయ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

లింగపాలెం: ధర్మాజీగూడెం సబ్‌స్టేషన్ కొత్త లైన్ ఏర్పాటు నిమిత్తం గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ కేఎం అంబేద్కర్ తెలిపారు. రంగాపురం సబ్ స్టేషన్ పరిధిలో ఇండస్ట్రియల్ ఫీడర్, వేములపల్లి ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

వ్యవసాయ విద్యుత్ వేళల్లో మార్పు

జంగారెడ్డిగూడెం: గ్రీన్ ఫీల్డ్ హైవే పై వెళ్లే ట్రాన్స్ కో టవర్ లైన్ల మార్పుకు జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాలలో ఈ నెల 4వ నుంచి 10వ తేదీ వరకు వ్యవసాయ విద్యుత్ వేళల్లో మార్పు చేశామని ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. ఎ–గ్రూప్‌లో ఉదయం 2 నుంచి 11 గంటల వరకు, బి–గ్రూప్‌లో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, రాత్రి 10 నుంచి 12 గంటల వరకు సరఫరా ఉంటుందని చెప్పారు. వినియోగదారలు సహకరించాలని ఆయన కోరారు.

ఎక్సైజ్ దాడులు

పోలవరం రూరల్: బైండోవర్ నిందితుడికి పోలవరం తహసీల్దార్ జరిమానా విధించినట్టు పోలవరం ఎక్సైజ్ సీఐ కె.వీరబ్రహ్మం తెలిపారు. ఎల్ఎన్‌డీపేటకు చెందిన ఇళ్ల అయ్యప్పను సారా కేసులో గతంలో పోలవరం తహసీల్దార్‌కు బైండోవర్ చేశామనానరు. సదరు ముద్దాయి మళ్లీ అదే నేరం చేయడంతో తహసీల్దార్ రూ.20 వేలు జరిమానా విధించారని తెలిపారు. ఈ మొత్తాన్ని మంగళవారం ముద్దాయి నుంచి వసూలు చేసి ప్రభుత్వ ఖజానాకు జమచేశామని సీఐ వీరబ్రహ్మం వివరించారు.

సీతంపేటలో ప్రారంభమైన ఉత్సవాలు

కొయ్యలగూడెం: సీతంపేట గ్రామంలో కొలువైన శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి శివాలయంలో మంగళవారం నుంచి ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. తొలి రోజు గణపతిపూజ, పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన, అగ్ని మధనం తదితర పూజలు చేశారు. శ్రీ చండీశ్వర శివలింగంతో పాటు వినాయక, కాలభైరవ, జంట సర్పదేవతలతో పాటు ప్రతిష్ఠించనున్న వివిధ దేవతామూర్తుల విగ్రహాలకు జలాధివాసం, క్షీరాధివాసం, తదితర పూజలు శాస్త్రోక్తంగా అర్చకులు నిర్వహించారు. హోమశాల వద్ద హోమగుండంలో ద్రవ్యాలను సమర్పించారు. 4వ తేదీన విశేష పూజలు హోమాలు నిర్వహించనున్నారు. 5వ తేదీ ఉదయం 8.18 గంటలకు ధ్వజస్తంభ ప్రతిష్ఠ, అనంతరం అన్నసమారాధన నిర్వహించనున్నారు.

యోగాభ్యాసాల కార్యక్రమం

కొయ్యలగూడెం: మండల పరిషత్ కార్యాలయంలో యోగాభ్యాసన కార్యక్రమం మంగళవారం 2వ రోజు కొనసాగింది. యోగాంధ్రలో భాగంగా 4 రోజులపాటు వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె.కిరణ్‌కుమార్ తెలిపారు. 6వ తేదీ వరకు పోటీల్లో వ్యక్తిగత యోగాసనాలతో పాటు సామూహిక యోగాసనాలు ఉంటాయన్నారు. ఎంఈఓలు జి.సురేష్‌బాబు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆ గ్రామాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి

వేలేరుపాడు : పోలవరం ముంపులో ఉన్న 41.15 కాంటూరు పరిధిలోని గ్రామాలకు వెంటనే ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా) పోలవరం డివిజన్ కమిటీ డిమాండ్ చేసింది. మండలంలోని మెట్టగూడెంలో కుంజా సత్తిబాబు అధ్యక్షతన నిర్వహించిన మాస్‌లైన్ సమావేశంలో ఏలూరు జిల్లా కమిటీ కార్యదర్శి ఎస్‌కే గౌస్ మాట్లాడారు. 41.15 కాంటూరు పరిధిలో ఉన్న పేరంటాలపల్లి, కాకిసనూర్, టేకుపల్లి, కాచారం, టేకూరు, సిద్ధారం, యడవల్లి, చిట్టం రెడ్డి పాలెం, ఎర్రపాడు, బోళ్లపల్లి, కొత్తూరు, తూర్పు మెట్ట గూడెం తదితర 14 గ్రామాలకు వెంటనే ఆర్ అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, పడమర మెట్టగూడెం గ్రామాన్ని, 45.72 కాంటూరులో ఉన్న కొర్రాజుల గూడెం, చాగరపల్లి, సుద్దగుంపు, శివకాశీపురం, నాగులగూడెం, నడిమిగొమ్ముకాలని, వసంతవాడ, మద్దిగట్ల, గుంపెనిగూడెం, పాత పూచిరాల, పూచిరాల కాలనీ తదితర గ్రామాలను 41.15 కాంటూరులో తీసుకొని ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, 41.15 కాంటూరు గ్రామాలకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు. 45.72 కాంటూరు ముంపు గ్రామాల భూములకు నష్టపరిహారం ఇవ్వాలని, మండలాన్ని యూనిట్‌గా అన్ని రకాల నష్టపరిహారం ఇచ్చిన తర్వాతనే నిర్వాసితులను తరలించాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా, డివిజన్ నాయకులు సిరికొండ రామారావు, గడ్డల ముత్యాలరావు, కట్టం వీరాస్వామి, పోలవరం పార్టీ డివిజన్ కార్యదర్శి కట్టం ముత్యాలరావు, నార్లవరం ఎంపీటీసీ కట్టం రత్తమ్మ, నార్లవరం సర్పంచ్ మడివి రంగమ్మ, తిరుమలాపురం సర్పంచ్ సోడే విజయ, కారం భాస్కర్, వూకే రవి, ఆశి లక్ష్మయ్య, వూకే బుచ్చయ్య, చిచ్చుడు రాజులు, కె.వెంకటరాముడు, పీసడి తమ్మయ్య, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి ఎస్‌కే మున్ని తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు


బుట్టాయగూడెం : దొరమామిడిలో తవ్వేసిన గుట్టను చూపిస్తున్న సర్పంచ్


కొయ్యలగూడెం : శ్రీరామ గట్టు చెరువు నుంచి మట్టి తోలకాలు

బుట్టాయగూడెం: మండలంలోని దొరమామిడి పరిసర ప్రాంతాల్లో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ రాత్రి వేళల్లో కొండలు, గుట్టలు, చివరకు పంట బోదెలు కూడా వదలకుండా గుర్తు తెలియని వ్యక్తులు మట్టి తవ్వకాలు చేస్తున్నారు. దొరమామిడి సమీపంలోని దుద్దుకూరు గ్రామానికి వెళ్లే పంట బోదెను సైతం తవ్వేయడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విచారణ చేసి తవ్విన ప్రాంతాన్ని మళ్లీ మూయించే విధంగా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తెల్లం రాముడు తెలిపారు. ఆయకట్టు రైతులు మాట్లాడుతూ పంట బోదె తవ్వడం వల్ల సుమారు 1100 ఎకరాల రైతులకు తీవ్రమైన ఇబ్బంది కలిగే అవకాశం ఉందన్నారు. కూటమి నాయకుల కనుసైగల్లోనే ఈ అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు కోరారు.

సాగు చెరువుల్లో మట్టి అక్రమ తవ్వకాలు

కొయ్యలగూడెం: శ్రీరామ గట్టు చెరువు నుంచి మట్టి అక్రమతోలకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. మంగళవారం మట్టి అనుమతులు లేని వాహనాల్లోనూ బయ్యన్నగూడెంకు చెందిన కూటమి నాయకుడు తోలకాలు కొనసాగించారు. మట్టి ఇటుక బట్టీలకు, లేఅవుట్ల నిర్మాణానికి వినియోగిస్తుండడంతో భారీ ఎత్తున ట్రక్కులు శ్రీరామ గట్టుకు క్యూ కట్టాయి. ప్రజా ప్రతినిధుల ఒత్తిళ్ల వల్ల ఇరిగేషన్ అధికారులు అచేతనంగా మారారు అంటూ ఆయకట్టు రైతాంగం ఆరోపణలు చేస్తున్నారు. రాత్రి వేళల్లో కూడా మట్టి అక్రమ రవాణా చేస్తుండడంతో పశువులు బెదిరి పారిపోతున్నాయని వారు ఆవేదన చెందుతున్నారు. దీనిపై పీడబ్ల్యూడీ ఏఈ భాస్కర్ దృష్టికి మట్టి అక్రమ రవాణా విషయం తీసుకువెళ్లగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన


రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పిస్తున్న ఆర్టీఓ మదని

టి.నరసాపురం: రహదారి భద్రతాల నియమాలను పాటించడం ద్వారా ప్రతి ఒక్కరు సురక్షిత ప్రయాణాన్ని కొనసాగించవచ్చని ఆర్టీఓ మదని అన్నారు. టి.నరసాపురంలో వాహన తనిఖీలు నిర్వహించి వాహనదారులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. మైనర్లకు వాహనాలిస్తే వాహన యజమానిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అతివేగం ప్రాణాంతకమన్నారు. హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. మోటార్ సైకిల్, ఆటో, ట్రక్, ట్రాక్టర్‌లను తనిఖీ చేశారు. సీనియర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఎస్ రంగనాయకులు మాట్లాడుతూ ఆటోల్లో ఇరువైపులా ప్రయాణికులను కూర్చోబెట్టుకోవద్దని, మద్యం సేవించి వాహనాలను నడపొద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి సూచించారు. వెహికల్ ఇన్‌స్పెక్టర్ వై.సురేష్‌బాబు మాట్లాడుతూ సెల్‌ఫోన్ మాట్లాడుతూ ఆటో నడపడం సురక్షితం కాదన్నారు.

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం


సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమైక్యత ర్యాలీ

జంగారెడ్డిగూడెం: ఉగ్రవాద వ్యతిరేక పోరాటానికి దేశంలోని లౌకిక పార్టీలు కలిసి రావాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వి.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రోటరీ క్లబ్ నుంచి బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహం వరకు సమైక్యతా యాత్ర నిర్వహించారు. మత సామరస్యం వర్ధిల్లాలి, ప్రజలందరూ ఐక్యతతో ఉండాలని నినదించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, బి.బలరాంలు మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది చనిపోయారని తెలిపారు. ఉగ్రదాడిని ఖండించడంలో ప్రదర్శించిన ఐక్యత, సమైక్యతా స్ఫూర్తి ప్రజలందరినీ ఒక్క తాటిపై నిలిపిందన్నారు. ఉగ్రవాద దాడిని రెండు దేశాల మధ్య అంతర్గత విషయాల్లో అమెరికా కలగజేసుకోవడం దుర్మార్గమని అన్నారు. మనుషులను వారి మతాన్ని తెలుసుకుని హత్య చేయడం ద్వారా ఉగ్రవాదులు దేశంలో మతపరమైన విభజనను తీసుకురావాలని, విశ్వ ప్రయత్నం చేశారని ఆరోపించారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యుల ఆందోళన


నిరసన వ్యక్తం చేస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు

కొయ్యలగూడెం: ఎక్సైజ్ శాఖ అధికారుల వేధింపుల నుంచి తమకు రక్షణ కల్పించాలని కొయ్యలగూడెం చాంబర్ ఆఫ్ కామర్స్, వర్తక, వ్యాపార వాణిజ్య సంఘాల సభ్యులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. పోలవరం ఎక్సైజ్ శాఖ అధికారులు తమ దుకాణాలలో బెల్లం విక్రయించవద్దంటూ నోటీసులు జారీ చేశారని తెలిపారు. సారా తయారీకి బెల్లం వినియోగిస్తుండడంతో దుకాణాలలోని బెల్లం విక్రయాలు నిలిపివేయాలంటూ ఆదేశించారన్నారు. బెల్లం ఉన్న దుకాణాలపై కేసులు నమోదు చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. కొనుగోలుదారులలో ఎవరు దేనికి వినియోగిస్తారో తమకు ఏవిధంగా తెలుస్తుందన్నారు. కానీ అధికారులు నాటు సారా పేరు చెప్పి తమను మానసికంగా వేధిస్తున్నారన్నారు. ఇటువంటి వేధింపుల వలన పొంగుటూరుకు చెందిన ఒక వ్యాపారి దుర్మరణం పాలయ్యాడని తెలిపారు. కూటమి పార్టీలు ఎన్నికలలో ఇదే సమస్యపై తమకు అనుకూలంగా హామీ ఇచ్చారని కానీ అమలుకు నోచుకోలేదని అన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కె.చెల్లన్న దొరకు వినతిపత్రం అందజేశారు. చాంబర్ అధ్యక్షులు మద్దు మోహన్, ప్రధాన కార్యదర్శి గొలిశెట్టి శ్రీను, కంభంపాటి మోహనరావు, నల్లూరి నాగేశ్వరరావు, సరాబు సుబ్బారావు, తిరణాతి లక్ష్మణరావు, అప్పన శ్రీను, ఎస్ శ్రీనివాస్, పి.స్వామి, ఎస్.సుబ్బారావు, పి.మణికంఠ తదితరులు పాల్గొన్నారు.